# కథల కథ

కె. పి. బాబు

పన్నెండేళ్ల పాప ప్రతి శనివారం రాత్రి "ఎప్పుడు తెల్లారిపోతుందా, ఎప్పుడు ఆంధ్రపత్రిక వారపత్రిక చూస్తానా?" అనే ఆలోచిస్తుండేది... ఆదివారం ఉదయమే పాప నాన్నగారు తాతగారితో కలసి బజారు వెళ్లిపోయేవారు. స్నేహితులతో కలసి తిరగడానికని నాన్న అటూ ఇటూ పోతే- తాత మాత్రం పాపకోసమని వారపత్రికా, తన కోసమని మరికొన్ని పత్రికలూ కొని ఇంటి వెచ్చాలు తీసుకొని తొందరగా తిరిగి వచ్చేసేవాడు. రాగానే పాప తాతమీదకు ఎగబడి పత్రిక లాక్కొని తనగదిలోకి పరుగెత్తిపోయేది...

ఒకరోజు మామూలుగానే ఆత్రంగా తాతచేతిలోని వారపత్రిక లాక్కొని పేజీలు తిరగేస్తున్నది పాప. హఠాత్తుగా ఆ పిల్ల కళ్లకి "దసరా పిల్లల ప్రత్యేక సంచిక" ప్రకటన కన్పించింది—గబగబా ఆ ప్రకటన సాంతం చదివేసింది. పాపకి అంతవరకూ కథలు చదవడం చెప్పడంతప్ప కథలు వ్రాయడం అలవాటులేదు, కాని- బొమ్మరిల్లులో తన కథలు రంగురంగుల బొమ్మల్తో పడాలనీ, తన పేరు ఎంచక్కా అచ్చవాలనీ ఎన్నాళ్లనుంచో కోర్కెగా ఉండేది. తానూ ఓకథ వ్రాసి పంపిస్తే?... ఈసారైనా తప్పకుండా ఒక కథ వ్రాయాలనుకొంది. బాగా ఆలోచించి చూచింది తన గదిలో తిరిగ్గా కూర్చుని చక్కగా ఒక కథ వ్రాసేసింది—శ్రమపడి!.

సాయంత్రం - తాత తోటలో పడక్కుర్చీలో పడుకొని ఆకాశంలోకి చూస్తూ ఆనందిస్తున్నాడు పాప మెల్లగా వెళ్లి తాను వ్రాసిన కథని తాతకిచ్చింది, చూడమని. తాత అదిచూస్తూనే వింతగా "ఇదేమిటమ్మా!" అన్నాడు.

"ఆంధ్ర వారపత్రిక్కి"

"ఓ ఇంకేం!" అంటూ ఆనందంతో పాపకథని పరిశీలించసాగాడు తాత. ఆత్రం కన్పించనీకుండా చూస్తూ నిలబడింది పాప.

అంతా చదివాక "అయితే పాపా! నేనొకటడుగుతాను. నిజం చెప్తావా?" అనడిగాడు తాత.

"ఓ. తప్పకుండాను!" అంది.

"ఈ కథ చాల బాగుందమ్మా! కాని, ఇలా చూడుపాపా, ఇది నీ పాఠాల పుస్తకంలోది కాదు కదా?" అన్నాడు నెమ్మదిగాను. పాప బిక్కముఖం పెట్టేసింది. తాత నవ్వాడు— "స్వంతంగా ఊహించి, కల్పించి స్వతంత్రంగా వ్రాసి పంపాలి కాని, కథలు కాపీ కొట్టి వ్రాయకూడదమ్మా! అది చాల తప్పు." పాప చాల చిన్నబుచ్చుకొంది— "తాతా! మరి - నాకు కథలు చదవడం, ఇంకోళ్లకి చెప్పడమైతే బాగా వచ్చుగాని, కథలు రాయడం రాదు - కదా—! ఎలా చెప్పు?" అంది.

"స్వంతంగా ఊహించి కథలు వ్రాయడం చేతకాదని, కాపీ కొట్టడం కూడదమ్మా! ప్రయత్నించాలి, సాధించాలి! అదీ మంచి పని!" అన్నాడు తాత. "కథలు స్వంతంగా రాయడమెట్లా?" అంటూ ఎంతో ఆశగా, అడిగింది పాప. "గట్టి చిక్కే తెచ్చిపెట్టావే! సాధారణంగా మన చుట్టుప్రక్కల్లో ఎవ్వరూ కూడా ఒక విద్యగా ఈ కథలు వ్రాయడాన్ని నేర్చుకోలేదు. ఇతరదేశాల్లో అక్కడ కూడా దీనికి పద్ధతులంటూ కొన్ని నేర్పుతారట కాని, మన దేశంలో ఆ విధానాలు లేనట్లే!" అంటూ బుర్ర గోక్కున్నాడు తాత. పాప ఉన్నట్లుండి చటుక్కున "అయితే, నీవెలా వ్రాయగల్గుతున్నావమ్మా?" అనడిగింది వుడుకుమోతుతనంగా.

"అవును మంచిప్రశ్నే అడిగావు పాపా! నేను కథలు వ్రాయడం ఎట్లా అలవాటు చేసుకొన్నానో, మొదటినుంచీ వివరంగా చెప్తాను— బాగావిను నీవూ ఆవిధంగాచేస్తే నీకూ కథలువ్రాయడం అలవాటౌతుందేమో!" అంటూ తాత ఇలా చెప్పడం ప్రారంభించాడు...

"నా చిన్నతనంలో— అంటే స్కూల్లో చదువుకొనే రోజుల్లో

సంగతి - అప్పుడు నాకు తీరికైనప్పుడల్లా, ఏవైనా కథల పుస్తకాలు చదువుకోవాలనీ, ఆటలాడుకోవాలనీ ఉత్సాహపడేవాడ్ని. పుస్తకాలు విపరీతంగా చదువుతుంటే, నాకేవేవో క్రొత్తక్రొత్త ఊహాలు పుట్టుండేవి నేనూ కథలు వ్రాయాలని, అన్పించేది. స్కూల్లో కూడా కాంపోజిషన్లు బాగా వ్రాసేవాడినని నన్ను మా మేష్టర్లు మెచ్చుకొనేవాళ్లు. ఇంట్లో అందరూ - ఇప్పుడు నిన్నంటున్నట్లే, అప్పుడు నన్నుకూడా - తెలివిగల బుర్ర అంటూండేవారు. అవన్నీ చూస్తుంటే, తప్పకుండా కథలు వ్రాస్తే, బాగా వ్రాయగలనని తోచింది! అంతే— ఒకనాడు చటుక్కున, ఊహించి స్వతంత్రంగా ఒక కథవ్రాసి పారేశాను"

పాప భుజాలెగరేస్తూ "ఓస్. ఇంతేనా? అయితే రేపట్నుంచే నేనింకా బోలెడు పుస్తకాలు చదువుతాను... కాని నిలా నాకూ కథలు వ్రాయడం వస్తుందంటావా తాతా?..." అంది. తాత నవ్వి ఇలా చెప్పాడు— "అప్పుడే కథ అయిపోలేదమ్మా! పూర్తిగా విను

"ఆ మర్నాడు నాకేమో అనిపించి, నేను వ్రాసిన కథని మా తెలుగు మాష్టారుకి చూపించాను. ఆయన చదివి నన్ను చూచి నవ్వారు. 'నీకథ ఎలాగుందో నేను చెప్పటం ఎందుకు కాని, నీ ప్రాణస్నేహితు డెవరికైనా చదివి విన్పించు. ఆ తరువాత నాదగ్గరకు రా' అన్నారు. ఆయన మాటలంటే నాకెంతో గురి. నా కథని ఒకనాటి సాయంకాలం స్నేహితుడొకణ్ణి తోటలోకి తీసుకువెళ్లి అక్కడ సర్దాగా చదివి విన్పించాను."

"అప్పుడేం జరిగిందేమిటి తాతా?" అని అడ్డుపడింది పాప.

"అదేమిటోగాని, అలా చదువుతుంటే ఏవో కొన్ని లోపాలు నాకే కన్పించాయి ఆకథ విన్న నా మిత్రుడు కూడా నిర్మొగమాటంగా ఎక్కడ బాగాలేదో చెప్పాడు. పైగా వాడి ఉద్దేశ్యంలో ఆకథ ఎక్కడ ఏవిధంగా ఉంటే ఇంకా బాగుంటుందో అదంతా కూడా చెప్పాడు. వాడు నాస్నేహితుడు కనుక, అలా చెప్పినా నాకేం బాధగాని సిగ్గుగాని కలుగలేదు. అప్పుడు నేను తిరిగి ఆ కథని కొంత సరిచేసి, మళ్లీ మా పంతులు గారికి చూపించాను.

మళ్లీ పాప అందుకొని "మరి పంతులుగారు రెండోసారి ఏమన్నారు తాతా?" అనడిగింది. "చెప్తున్నా తొందరపడకూ!... ఆయన నేను తిరుగ వ్రాసుకొచ్చిన కథని చూచి "నీకెలాగుందిరా?" అనడిగారు "నాకు బాగానే ఉంద" న్నాను. "సరే— ఈ కథని భద్రంగా కొంతకాలం దాచి వుంచు. తర్వాత చూద్దాం" అని చెప్పారు.

"నాకు చాల ఆశాభంగం కలిగినా ఆయన చెప్పారుగదా అని అలానే చేశాను. మరుసటి నెలలోనే మా స్కూలు తరఫున ఒక పత్రిక ప్రకటించడానికి సన్నాహాలు ప్రారంభించారు. స్కూలు విద్యార్థులందరిచేతా రచనలు వ్రాయించి, వాటినన్నిటినీ సరిదిద్ది ప్రకటించే భారం మా పంతులు గారిమీద పడింది. ఆయన ప్రథమంగా నా కథని గురించి అడిగారు. చాల సంతోషంగా ఇస్తానని చెప్పాను. ఇంటికొచ్చి దాచి ఉంచిన 'నా కథనుతీసి చదివి చూశాను. స్కూలుపత్రికలో నాకథ పడ్తే ఎంతోమంది చదువుతారు గదా; వాళ్లందరూ బాగుందంటారో లేదో అని ఆలోచించిచూస్తే, ఆకథ నాకేమీ తృప్తిగా లేదు. అంతకుముందు ప్రతిరోజూ నేను దాన్నిగురించే ఆలోచిస్తుండేవాడ్ని కనుక— నాకింకా ఎన్నోలోట్లు దానిలో కనిపించాయి. కాని, వాటిని సర్దగల ననే ధీమాకూడా కలిగింది. అంచేతనే తిరిగి ఆ కథని సరిదిద్దివ్రాసి మా పంతులుగారి కిచ్చాను. అప్పటికి ఆయన నా భుజంతట్టి 'బాగుందిరా' అన్నారు... అంతేకాదు, స్కూలు పత్రికలో మొదటి పేజీల్లోనే నా కథ వేశారుకూడా' నా కథ చదివినవాళ్లంతా చాల మెచ్చుకొన్నారు. చాలమంది నేనే అంతచక్కని కథ వ్రాశానంటే నమ్మలేకపోయారు కూడాను..." అంటూ తాత ముసిముసి నవ్వులు విసిరాడు

పాప ఇదంతా విని నోరావలించి "అబ్బో! చాల కథే ఉందే దీనికి?" అంది.

"మనంవ్రాసే కథలు బాగా కుదరడానికి ఇంతే కాదు, ఇంకా ఎంతైనా శ్రమపడాలని నేను స్వానుభవంమీద తెల్సుకో

(53-వ పేజీ చూడండి)

"ఏమోయ్, మీ కొత్త పనిమనిషి తిన్నగా వుంటోందా?"

"ఆ; ఇప్పటికి అరడజను మంది అయ్యారుగదూ. ఈ మనిషి కూడా వాళ్ళలాగానే పని మానేస్తుందేమోనని చాల మర్యాదగా చూస్తున్నాను."

"అయితే ఇక ఏమిటీ నీ విచారం."

"నా ప్రవర్తన నచ్చక మా ఆవిడ పుట్టింటికెళ్ళిపోయింది"

# కథల కథ

(43-వ పేజి తరువాయి)

గల్గాను." అన్నాడు తాత. "అదీ చెప్పెయి" అంది ఆసక్తిగా పాప.

చందమామ వెలుగులు వెదజల్లుతున్నాడు... చాల ఆహ్లాదకరంగా వుంది!... "నీవు వ్రాసే కథ అయిదు పంక్తుల్లో సరిపోయినా, లేక అయిదు పేజీలైనా, కాక, అయిదొందల పేజీలదైనా— ముఖ్యంగా అది చదివేవాళ్లు ఉత్సాహం కలిగి 'ఇంకా ముందేమి జరుగుతుందో' ననే ఆత్రం పొందేటట్లు వ్రాయాలేగాని, నీరసపడిపోయి నిద్రపోయేట్లుండకూడదు. ఇంకో చిన్న విషయం— చిన్న చిన్న ఇటుకలతో కట్టిన గోడలెంత బలంగా ఉంటాయో, చిన్న చిన్న మాటలతో, వాక్యాలతో వ్రాసిన కథలూ అంత జిగిగాను చక్కగాను ఉంటాయి. కనుక, నీకు తెలియనివీ, అర్థంకానివీ, అయినటువంటి మాటలను, గొప్పకోసం వాడబోకు. చక్కగా నీ కర్థమైనటువంటి సులభమైన మాటలతోనే ఎప్పుడూ వ్రాయి. అనీ కాకుండా, నీవు చెప్పేదేమిటో సూటిగా, అర్థమౌతుండాలి. అంతేగాని డొంక తిరుగుళ్లుగాను, గంద్రగోళంగాను ఎప్పుడూ వ్రాయకూడదు!— తెలిసిందా?" అన్నాడు తాత.

"తెలిసింది తాతా! కథలు వ్రాయడమంటే ఎంత కష్టమైన పనో బాగా తెలిసింది" అంటూ నవ్వింది పాప. మురిపెంగా పాపని దగ్గరకు తీసుకొని తల నిముర్తూ "మరే మనుకొన్నావమ్మా! ఈ మాత్రం శ్రమపడలేనివారు ఇటువంటి ప్రయత్నాలే చేయకూడదు! సర్దా కొద్దీ శ్రమపడకుండా తొందరపడ్తూ వ్రాసేస్తే కథలు ఏం బాగుంటాయి? నీవు తెలివి తేటలు గలదానివి కనుక— అలా చేయక శ్రమపడి, ఓర్పుతో కృషిచేసి అభివృద్ధిలోకి రాతల్లీ! ఏమంటావ్?" అనడిగాడు.

"నీమాట నే నెప్పుడైనా కాదని తిరిగానా తాతా?" అంది పాప అసూయకంగా. "అయ్యో నా తల్లీ— నేనలా అన్నానా?" అని తాత చెప్తుంటే, పాపతల్లి ఇంట్లోనుండి భోజనాలకు రమ్మని కేకేసింది. "వస్తున్నా" మంటూ అమ్మకి జవాబిచ్చి పాప తాతతో కలిసి లోనికి నడిచివెళ్లుతూ కథలనుగురించి ఆలోచిస్తోంది. "తప్పకుండా నీవభివృద్ధికి వస్తావు పాపా?" తాత పాపని మనసులోనే ఆశీర్వదిస్తూ ముందుకు నడిచాడు.

★

కేసరి రత్నత్రయము

లోధ్ర

గర్భాశయ రోగ నివారిణి

స్త్రీలకు గలుగు ఋతుశూలం. బహిష్ఠ కాకుండుట. అకాల బహిష్ఠ, మైల జాస్తిగాను తక్కువగాను పోవుట. కుసుమరోగము సంతానహీనత. రక్తహీనత, మలబద్ధము, సూతికావాతము, కీళ్ళనొప్పులు, అరికాళ్ల, అరచేతులు మంట మొదలగు స్త్రీ మర్మవ్యాధులను కుదుర్చును లోధ్ర స్త్రీలపాలిటి వరప్రసాదము, కల్పవృక్షము. కామధేనువు, కొంగు బంగారము, రత్నఖచిత యాభరణము, సర్వాభీష్ట ప్రదాయినియని వాడినవారు పలువిధములుగ స్తోత్రము చేయుచున్నారు.

అమృత

రక్తశుద్ధి ద్రావకము

ఇది రక్తహీనత, మలబద్ధము, అజీర్ణము, కీళ్ల నొప్పులు, సోమరితనము, మేహవ్రణములు, సుఖసంకటములు, విప్పత్తుప, కడుపులోమంట మొదలగు వ్యాధులను నివారించి శరీరమునకు కాంతిని ముఖమునకు తేజస్సును యిచ్చును ఈ మేలైన యౌషధమువలన యెందరో యారోగ్యవంతులైనారు.

అర్క

సర్వజ్వర నివారిణి

ఆహార, విహార ఋతుభేద దోషంబుల వలన అన్నాశయమునందు క్రిమికూటము చేరి బహువిధములైన జ్వరములు సంభవించుచున్నవి వాతజ్వరము, పిత్తజ్వరము కఫజ్వరము, సన్నిపాతజ్వరము, మరి యితర విషమజ్వరములను, కడుపులో ప్లీహమను జ్వరగడ్డను కుదుర్చును ఈ ఔషధమును పసిబిడ్డలకుగూడ యివ్వవచ్చును

కేసరి కుటీరం

లిమిటెడ్

రాయపేట మద్రాసు-14

తెనుగుజిల్లాలకు, నైజామునకు ఏజంట్లు.

శ్రీ సీతారాం జనరల్ స్టోర్సు

బెజవాడ సికిందరాబాదు